# చీరాలమ్మ జాతరకు శ్రీకారం

కొలిచిన వారికి కొంగు బంగారమై భాసిల్లుతున్న చీరాలమ్మ జాతర మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఏడు గ్రామాల ప్రజల ఇలవేల్పు అమ్మవారి ప్రతిరూపమైన గెరిగకు గ్రామాల్లోని ఇంటింటా కర్పూర నీరాజనాలు సమర్పించారు.

- అమ్మవారి ప్రతిరూపమైన గెరిగ ఊరేగింపు
- ఏడు గ్రామాల్లో ప్రజలు కర్పూర నీరాజనం
- బుధవారం రాత్రి అంబరాన్నంటే జాతర సంబరం


గుత్తివారిపల్లెలో అమ్మవారి గెరిగ ఊరేగింపు

**రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్):** రేణిగుంట మండలం కృష్ణాపురంలో బుధ, గురువారాల్లో జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. తొలుత జాతరకు ముందు చీరాలమ్మ ప్రతిరూపమైన గెరిగ ఊరేగింపు ఆదివారం రాత్రి కృష్ణాపురంలో మొదలై, మల్లవరం, ఎల్ఎన్ కండ్రిగ, డీపీ కండ్రిగ, కుమ్మరపల్లె, గుత్తివారిపల్లె, ఎస్‌యుపురం గ్రామ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి చివరగా మంగళవారం రాత్రి కృష్ణాపురానికి చేరుకుంది. ప్రతి ఇంటా కర్పూర హారతులు పట్టారు. బుధవారం రాత్రి చీరాలమ్మ గుట్టమీద అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు గురువారం తెల్లవారుజామున అమ్మవారిని దర్శించుకునేందుకు రావడం పరిపాటి. దీనికి దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. అలాగే గురువారం కృష్ణాపురంలో గంగమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం వేకువ జామున రెండు గంటలకు గంగమ్మ నిమజ్జనంతో జాతర పరిసమాప్తమవుతుంది.

### అమ్మవారు మా ఇంటి ఆడపడుచు



చీరాలమ్మ దశాబ్దాల క్రితం మా ఇంటి ఆడపడుచుగా ఉన్నట్లు మా పెద్దలు చెప్పేవారు. నాటి నుంచి ప్రతి ఏటా జాతర రోజు అమ్మవారికి పుట్టింటి సారె, పసుపు కుంకుమలను ఊరేగింపుగా తీసుకొని వెళ్లి తొలి పూజ చేస్తాం. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తాం. ఈ సంవత్సరం కూడా జాతర మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

-కుమార ముద్దురాయలు సర్పంచ్, కృష్ణాపురం

## క్లుప్తంగా

### రీసర్వేకు సహకరించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీదేవి

**బుచ్చినాయుడుకండ్రిగ:** భూముల రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని రీ సర్వేకు సహకరించాలని తహసీల్దార్ శ్రీదేవి కోరారు. తిమ్మభూపాలపురం మంగళవారం సర్వేకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, భూముల రీసర్వే రైతులకు ఓ వరమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూముల రీ సర్వేలో అన్ రిజిస్టర్, వంశపారంపర్య భూములను గుర్తించి రికార్డుల్లో నమోదు చేసి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తామన్నారు. సర్వే అధికారులు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. తిమ్మభూపాలపురం గ్రామరెవెన్యూలో 386.78 ఎకరాలు భూమి ఉందని, ఇందులో 85 ఖాతాలకు గాను ప్రభుత్వ భూమి 123.18 ఎకరాలు, పట్టా భూమి 263.60 ఎకరాలు ఉందన్నారు. భూ సమస్యలు తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

### పోషణ్ పక్వాడ పక్షోత్సవాలు


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు

**రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్):** ఐసీడీఎస్ ప్రాజెక్ట్, చైల్డ్ ఫండ్-రాస్ సంయుక్త ఆధ్వర్యంలో రేణిగుంట మండలంలోని జీ పాల్యం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ పక్షోత్సవాలను నిర్వహించారు. పోషణ ట్రాకింగ్, పోషకాహార ప్రాముఖ్యత, సమతుల ఆహారం ఏ విధంగా తీసుకోవాలి? ఇత్యాది అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే చంటి పిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు, కిశోర బాలికలకు ఎలాంటి పోషకాహారం ఇవ్వాలో తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి, రాస్ గృహ విజ్ఞాన శాస్త్రవేత్త దివ్య సుధ, రాస్ కో-ఆర్డినేటర్ భారతి, మహిళా పోలీస్ కవిత, అనూష, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మోడల్ ప్రైమరీ స్కూల్ మాకొద్దు


పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని కాటూరు లోని ప్రాథమికోన్నత పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చవద్దని మంగళవారం పాఠశాల ముందు విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల్లో 115 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, 6,7,8 తరగతుల్లో 50 మంది విద్యార్థులున్నారని తెలిపారు. ప్రభుత్వం యూపీ స్కూల్‌ను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చడంతో 6,7,8, తరగతుల విద్యార్థులు 5 కిలోమీటర్లు దూరంలో ఉన్న పల్లమాల జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. గ్రామం నుంచి బస్టాండ్‌కు కిలోమీటరు దూరం ఉండడంతో ఉదయం, సాయంత్రం ఇంటికి రావడానికి ఇబ్బంది పడుతారని తెలిపారు. యూపీ స్కూల్‌ను ప్రైమరీ స్కూల్‌గా మార్చితే ఊరుకోమని, పాఠశాలకు బీగాలు వేస్తామని హెచ్చరించారు. మండల విద్యాశాఖాధికారులు వారం రోజులుగా ప్రధానోపాధ్యాయులను ప్రైమరీ స్కూల్‌గా మార్చడం కోసం సంతకాలు పెట్టమని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ప్రైమరీ స్కూల్ వద్దని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మేకల మురళి, ఉపసర్పంచ్ కాటయ్య, గ్రామస్తులు హేమచంద్రారెడ్డి, కృష్ణమూర్తి, ధనంజయులు, బత్తెయ్య, రమేష్, వెంకటేశ్వర్లు, ప్రశాంతి, సుజాత, మునెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ పరామర్శ


పెద్దిరెడ్డిని కలిసిన వరదయ్యపాళెం వైఎస్సార్ సీపీ నాయకులు

**వరదయ్యపాళెం:** మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం తిరుపతిలోని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల పెద్దిరెడ్డి చేతికి గాయమై, చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండడంతో మండల నాయకులు, సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో పాటు పెద్దిరెడ్డిని కలిశారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. కలిసిన వారిలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, వీవర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొప్పన తిలక్‌బాబు, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు శివా యాదవ్, మాజీ సర్పంచ్ కవిత, నాయకులు లోకేష్, రమేష్ ఉన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు రేగితే ఎలా ఆర్పాలో ఎస్వీమార్ట్ వద్ద అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది


సత్యవేడులో..

**శ్రీకాళహస్తి:** అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని ఎస్వీ మార్ట్, రైల్వేస్టేషన్ పరిసరాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని, గ్యాస్ ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి నుంచి సురక్షితంగా ఎలా బయట పడాలో ప్రదర్శనపూర్వకంగా తెలియజేశారు. అలాగే ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అగ్నిమాపక అధికారి నాగార్జునరెడ్డి, సిబ్బంది, సునీల్‌కుమార్, అమర్‌నాథ్, రాజా, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సత్యవేడులో..**

**సత్యవేడు:** వేసవిలో అగ్ని ప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్యవేడు అగ్నిమాపకశాఖ అధికారి రాజయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీకాళహస్తి, తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ల వద్ద కరపత్ర ప్రచారం చేశారు. అలాగే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆయిల్ ఫైర్‌పై అవగాహన కల్పించారు. ఆయిల్ ఫైర్ జరిగినప్పుడుఆర్పే విధానాన్ని ప్రదర్శనపూర్వకంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ శ్రీనివాసులు, డీపీఓ గోవిందరాజులు, డీఓపీ జి. సుబ్రమణ్యం, ఎఫ్ఎం చంద్రన్, జీ.నరేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళాకు స్పందన



మేళాలో మాట్లాడున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**శ్రీకాళహస్తి:** పట్టణంలో మంగళవారం ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. మేళాను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కలెక్టర్ యువతను ఉద్దేశించి మాట్లాడారు. మేళాకు సుమారు 2వేలమంది నిరుద్యోగులు హాజరు కాగా అందులో వెయ్యిమంది ఎంపికయ్యారు. వారికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు. తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### ఘనంగా విద్యాప్రకాశనందగిరి 112వ జయంతి


పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామిని సత్కరిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు, చిత్రంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

**శ్రీకాళహస్తి:** పట్టణంలోని శుక బ్రహ్మాశ్రమంలో మంగళవారం శ్రీ విద్యాప్రకాశనందగిరి స్వామి112వ జయంతి వేడుకలను నిర్వహించారు. పీఠాధిపతి విద్యాస్వరూపానందగిరిస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన పీఠాధిపతులను ఆయన ఘనంగా సత్కరించారు. భక్తులను అనుగ్రహభాషణం చేశారు. ఆశ్రమంలో పలు పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు విద్యాప్రకాశనందగిరిస్వామిని ఘనంగా సత్కరించారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

### అల్పాహారం వితరణ

**రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్):** మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 75 వ జయంతి సందర్భంగా మంగళవారం రేణిగుంట సమీపంలోని అక్షయ క్షేత్రంలో వెదళ్లచెరువుకు చెందిన పవన్ కుమార్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు అల్పాహారం వితరణ చేశారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కృష్ణయాదవ్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహబూబ్ బాషా, అక్షయ క్షేత్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఇంటి పన్నులు చెల్లించండి

**బుచ్చినాయుడుకండ్రిగ:** ప్రజలు ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి, పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ వెంకటమ్మ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీతోపాటు గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం మాట్లాడారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణపై దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. గ్రామసభలో ప్రజలు పలు సమస్యలను నివేదించారు. శ్మశానంలో చెత్తను తొలగించాలని, ఇంటి పన్ను ఎక్కువగా వసూలు చేస్తున్నారని దీనిని తగ్గించాలని, మురుగు కాలువలు నిర్మించాలని కోరారు. ఉప సర్పంచ్ మునిరాజా, వెల్ఫేర్ అసిస్టెంట్ సునీల్ పాల్గొన్నారు.

### అభినందన



**శ్రీకాళహస్తి:** ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన స్థానిక ఎంజీఎం కళాశాల విద్యార్థులను మంగళవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సన్మానించి అభినందించారు. ఎంపీసీ గ్రూపులో భావన రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు, బైపీసీలో హాసిని ప్రియ 4వ ర్యాంకు, సీఈసీలో కిషోర్ మొదటి ర్యాంకు సాధించారు. ఉన్నత చదువుల్లోనూ ఇలాగే సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఎస్ రత్నం, ఏఓ మహదేవన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వడదెబ్బపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

**రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్):** రేణిగుంట జెడ్పీ బాలుర హైస్కూల్లో మంగళవారం డిప్యూటీ డెమో కిరణ్ కుమార్ విద్యార్థులకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, వేసవిలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగకుండా ఇంటివద్దే ఉండటం శ్రేయస్కరమన్నారు. ఒకవేళ తప్పని పరిస్థితుల్లో వెళ్లవలసి వస్తే ఎండ నుంచి రక్షణకు టోపీ ధరించడమో లేదా గొడుగు పట్టుకుని వెళ్లాలన్నారు. మంచి నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం, పుచ్చకాయలు, దోస కాయలు వంటివి తీసుకోవడం మంచిదన్నారు. అలాగే మాంసాహారం, మసాలా వంటకాలు వాడకం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రఘుప్రసాద్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయం ముట్టడి


ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించిన సీపీఐ నాయకులు

**సూళ్లూరుపేట:** సత్యవేడు నియోజకవర్గం పరిధిలో ని బుచ్చినాయుడు కండ్రిగ మండలం కనమనంబేడులో 252, 253, 254 సర్వేనెంబర్లులోని భూమిలో ఇంటి స్థలాలు లేని నిరుపేద దళితులకు ఇంటి నివేశనా స్థలాల పట్టాలు ఇవ్వాలని మంగళవారం సత్యవేడు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి ఏ చిన్నిరాజ్ ఆధ్వర్యంలో సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం లోపలే శిబిరం ఏర్పా టు చేసుకుని బాధితులందరూ ముట్టడిలో కూర్చు ని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఐ నాయకుడు చిన్నిరాజ్ మాట్లాడుతూ నిరుపేదలైన దళితులకు పట్టాలివ్వమని సుమారు సంవత్సర కాలం నుంచి పోరాటం చేస్తుంటే పైన తెలిపిన సర్వేనెంబర్లు కలిగిన భూమికి ఫెన్సింగ్ వేస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూశారని అన్నారు. రియల్ ఎస్టేట్ చేసుకునే వ్యాపారి వద్ద నుంచి ముడుపులు తీసుకుని రెవెన్యూ అధికారులు అతనికి సహకరిస్తున్నారని అన్నారు. ఆర్డీఓ జోక్యం చేసుకుని ఈ భూమిపై తగిన విధంగా విచారణ జరిపి దళితులకు న్యాయం చేయాలని కోరారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలం సీపీఎం కార్యదర్శి కత్తి ధర్మయ్య, ఇళ్లస్థలాల కోసం పోరాటం చేస్తున్న రమణయ్య, షణ్ముగం, గురవమ్మ, బాబు, వీరాస్వామి, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## జాతరోత్సాహం

- వైభవంగా ముత్యాలమ్మ జాతర
- ఊరేగింపుగా తీసుకువచ్చి సారె సమర్పణ




మైలు ముగ్గు

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం జాతర సందడి మొదలైంది. మూడు రోజుల జాతరకు సంబంధించి మొదటి రోజు మంగళవారం గెరిగ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ముత్యాలమ్మ ఆలయంలోని వినాయకస్వామి ఆలయం వద్ద విశేష పూజల అనంతరం అమ్మవారికి వివిధ అభిషేకాలు నిర్వహించి పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ధూప దీప నైవేద్యాలను సమర్పించారు. జాతరలో మొదటి రోజు ఉదయం మైలు, ముగ్గు, రాత్రి శేష పాన్పు ముగ్గు వేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, డప్పుల నడుమ ఊరేగింపుగా సారె తీసుకువచ్చి ముత్యాలమ్మకు సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు పోతురాజు, గెరిగలకు పూజలు నిర్వహించి ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు పర్యవేక్షించారు.


పూజలు చేస్తున్న దృశ్యం

## జీవనోపాధుల కల్పనే లక్ష్యం


మాట్లాడుతున్న ఏపీఎం మునెయ్య

**బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలోని ప్రతి సంఘమిత్ర, గ్రామ సమాఖ్య లీడర్లు జీవనోపాధుల కల్పనే లక్ష్యంగా పనిచేయాలని ఐకేపీ ఏపీఎం మునెయ్య ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐకే పీ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు రుణాలను సకాలంలో 100 శాతం చెల్లించడంతోపాటు అన్ని సంఘాలు ఏ-గ్రేడ్‌లో ఉండేలా చూడాలన్నారు. అలాగే వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం త్వరలోనే సభ్యుల హాజ రు ముఖ నమోదు వ్యవస్థను త్వరలోనే తీసుకు రాబోతున్నట్లు తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ త్వరలోనే ఉంటుందని, ప్రతి గ్రామసమాఖ్య ఆడిట్‌కి సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లీగల్ కో-ఆర్డినేటర్ సింగారం, సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, అకౌంటెంట్ హిమగిరిజ, మండల సమాఖ్య లీడర్లు శ్వేత, భారతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

**సత్యవేడులో..**

**సత్యవేడు:** జీవనోపాధులకు సంబంధించి వార్షిక ప్రణాళిక సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సత్య వేడు గ్రామీణాభివృద్ధి సంస్థ ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్ ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలు గు కార్యాలయంలో మహిళా సమైక్య తొలి సమావేశం నిర్వహించారు. డాంగేయాదవ్ మాట్లాడు తూ, శ్రీసిటీ, ఉన్నతి తదితర రుణాలు సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. మహిళా రైతు గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. స్వయం ఉపాధిపై ఆధారపడ్డ సభ్యులకు రూ. 40వేలు రుణం మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో వెలుగు కో-ఆర్డినేట ర్లు మధుసూదన్ రెడ్డి, పుల్లయ్య, పురుషోత్తం, శివకుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కోటీశ్వరి, అకౌంటెంట్ కాంచన, విఓ సంఘాల లీడర్లు పాల్గొన్నారు.